www.prajasakti.com

ప్రజాశక్తి



గణిత పరీక్షకు 114 మంది గైర్హాజరు

ప్రజాశక్తి-ముమ్మిడివరం

జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న పదో తరగతి పరీక్షల్లో భాగంగా మాథ్స్ పరీక్షకు 114 మంది గైర్హాజరైనట్లు జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ సలీం బాషా సోమవారం తెలిపారు. జిల్లావ్యాప్తంగా 110 కేంద్రాల్లో రెగ్యులర్, ప్రైవేట్ విద్యార్థులు 19,115 మందికి గాను 19,001 మంది 99.40 శాతం పరీక్షకు హాజరయ్యారన్నారు. జిల్లావ్యాప్తంగా 24 చోట్ల తనిఖీలు చేశామని, డిఇఒ-2, డివైఇఒ-2, ఏసిజిఇ-2, ఫ్లైయింగ్ స్క్వాడ్-9, ఎంఇఒలు-9 చోట్ల తనిఖీలు నిర్వహించారని తెలిపారు. ముమ్మిడివరం మండలంలో రెగ్యులర్, ప్రైవేట్ విద్యార్థులు 753 మందికి 751 మంది హాజరు కాగా ఇద్దరు గైర్హాజరైనట్లు సంబంధిత విద్యాశాఖాధికారులు తెలిపారు.

కబేళా సమస్యతో జనం సతమతం

పట్టణ వాసులకు తప్పని దుర్వాసన

ప్రజాశక్తి-రామచంద్రపురం

సుమారు 40 ఏళ్లుగా పట్టణ ప్రజలను ప్రయాణికులను నిత్యం వేధిస్తున్న సమస్య రామచంద్రపురం కబేళా. దీనిపై రామచంద్రపురం పట్టణవాసులు చోడవరం గ్రామస్తులు అనేకసార్లు ఉద్యమాలు చేశారు. కబేళాను తాత్కాలికంగా నిలుపుదల చేసిన పశు మాంసం విక్రయంతో రూ.లక్షలు సంపాదించే వ్యాపారులు కబేళాను యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. పలువురు రాజకీయ నాయకుల అండదండలతో మూడు పువ్వులు ఆరు కాయలుగా కబేళా వ్యాపారం కొనసాగుతోంది. రామచంద్రపురంలో పశ మాంసం వ్యాపారం చాపకింద నీరులా కొనసాగుతోంది. దీనిపై పలుమార్లు కేసులు నమోదు చేసినా ఫలితం లేదని ప్రయాణికులు, పట్టణవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రామచంద్రపురం పట్టణం నుండి కాకినాడ వెళ్లే మెయిన్ రోడ్‌లో నిత్యం ఈ ప్రాంతంలో భరించలేని దుర్వాసన వెదజల్లుతోంది. ఇక్కడ పశువులను వధించిన వ్యాపారులు వాటి వ్యర్థాలను వదిలేసి పోవడంతో భరించలేని దుర్వాసన నిత్యం వేధిస్తోంది. రామచంద్రాపురం కాకినాడ వెళ్లే బస్సులు ఎక్స్ ప్రెస్ బస్సులు, మోటార్ వాహనాలు, ప్రయాణికులుతో ఈ రోడ్డు నిత్యం రద్దీగా ఉంటుంది. దీంతో ప్రయాణికులు చోడవరం బైపాస్ రోడ్డు వచ్చిందంటే చాలు ముక్కు మూసుకుని వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. గతంలో కొత్తూరు రోడ్‌లో ఉండే ఈ కబేళాను నిర్వాహకులు నెమ్మదిగా పట్నంలోని బైపాస్ రోడ్డుకు తరలించారు. వారి వ్యాపారానికి అనుకూలంగా ఉండడంతో 40 ఏళ్లుగా ఇక్కడ కబేళా కొనసాగుతోంది. ఎక్కడో మారుమూల ప్రాంతంలో ఉండాల్సిన ఈ పశువధశాలను బైపాస్ రోడ్‌లో ఏర్పాటు చేయడం వల్ల అటు చోడవరం గ్రామస్తులకు ఇటు రామచంద్రపురం పట్టణ వాసులకు తీవ్ర ఇబ్బందులు పడవలసిన పరిస్థితి ఏర్పడింది. దీనిపై ఎన్నిసార్లు పోలీసులు కేసులు నమోదు చేసిన వ్యాపారులు తిరిగి కబేళాలో కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు. ఈ కబేళాను తొలగించాలని మంత్రి సుభాష్‌కు పట్టణవాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

శాశ్వత పరిష్కారం చూపాలి



ఎన్నో ఏళ్లుగా అపరిస్కృతంగా ఉన్న రామచంద్రపురం కబేళా సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలి. దీనివల్ల పరిసర ప్రాంతాల్లోనూ మెయిన్ రోడ్డు వెంబడి నిత్యం దుర్వాసన వెదజల్లుతోంది. ఇక్కడ పశువులను వధించి వ్యర్థాలను వదిలి వేయడంతో దుర్గంధం వ్యాపిస్తోంది. ఇక్కడికి వచ్చిన ప్రయాణికులు ముక్కు మూసుకోవాల్సి వస్తోంది. ప్రయాణికులు, ప్రజలు దీంతో ఇక్కట్లకు గురవుతున్నారు. దీనిపై ఎన్ని ఫిర్యాదులు వచ్చినా అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. రాజకీయ నాయకులు, అధికారులు చిత్తశుద్ధితో పనిచేసి కబేళాను వేరేచోటకు తరలించాలి.

- యాట్ల నాగేశ్వరరావు, బిసి సంఘం నాయకులు.



రామచంద్రపురం-కాకినాడ రోడ్‌లో చోడవరం వద్ద ఉన్న కబేళా

సిపిఎం చైతన్య యాత్రను జయప్రదం చేయాలి

నేడు ప్రారంభించనున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-అమలాపురం

సిపిఎం ఆధ్వర్యంలో మార్చి 25 నుంచి 28 వరకూ చేపట్టిన ప్రజా చైతన్య యాత్రను జయప్రదం చేయాలని, ఈ యాత్రను మంగళవారం గడియార స్తంభం సెంటర్ వద్ద పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.శ్రీనివాసరావు పార్టీ జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. అమలాపురం పట్టణం, రూరల్ మండలం, ఉప్పలగుప్తం, అల్లవరం, ముమ్మిడివరం మండలాల్లో యాత్ర కొనసాగుతుందని, యాత్రను జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. జిల్లాలో భూస్వాముల ఆక్రమణలో ఉన్న లక్షలాది కొబ్బరి చెట్టు పేదలకు పంచాలని, పేదలందరికీ ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలి, జగనన్న కాలనీలు, లే అవుట్లు మెరక చేయాలని, టిడ్కో ఇళ్ల రుణాలు బలవంతపు వసూళ్లు ఆపాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మికులకు 200 రోజులు ఉపాధి హామీ పనులు కల్పించాలని, రూ.600 వేతనం ఇవ్వాలని, మత్స్యకార గ్రామాల్లో సమస్యలు పరిష్కరించాలి, బోడసకుర్రు, పల్లిపాలెంలో రిటైనింగ్ వాల్ నిర్మించాలని, అర్హులైన వారికి మత్స్యకార భరోసా చెల్లించాలని, దళిత గ్రామాలలో మౌలిక వసతులు కల్పించాలని, శ్మశాన వాటికలకు స్థలాలు కొనుగోలు చేసి ఇవ్వాలని, గ్రామాలను ఆనుకుని ఉన్న మద్యం షాపులు, బెల్ట్ షాపులు తొలగించాలని, కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, రూ.50,000 ఎకరాకు రుణం ఇవ్వాలని, రైతులకు సాగు నీరు అందించాలని, ఒఎన్‌జిసి, ఆయిల్ కంపెనీల కాలుష్యాన్ని అరికట్టాలని, సిఎస్ఆర్ నిధుల ద్వారా గ్రామాలను అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. అక్రమ ఆక్వా చెరువులను అరికట్టాలని, ఆక్వా కాలుష్యాన్ని నియంత్రించాలని, కామనగరువులో ప్రభుత్వ మెడికల్ కాలేజీని ప్రభుత్వ ఆధీనంలో నడపాలి. అక్కడ భూమి కోల్పోతున్న పేదలకు రూ.50 లక్షల నష్టపరిహారం ఇవ్వాలని, వారికి ప్రతి కుటుంబానికీ ఇల్లు ఇక్కడే నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లాలో రైల్వే లైన్ నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలని, కోటిపల్లి-ముక్తేశ్వరం రేవుపై వంతెన నిర్మాణం చేపట్టాలని, అమలాపురం పట్టణంలో ట్రాఫిక్ నియంత్రించాలని, ఎర్రవంతెన, ఈదరపల్లి, నల్ల వంతెన వద్ద బ్రిడ్జి నిర్మాణం చేయాలని, కోనసీమలో కొబ్బరి ఆధారిత పరిశ్రమలు నెలకొల్పాలని, ఆయిల్ రిఫైనరీ కంపెనీలు ఏర్పాటు చేయాలని డిమాండ్లతో చేపట్టిన ఈ యాత్రను జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.

తాగునీటి కోసం మహిళల నిరసన

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

ఎన్నో ఏళ్లుగా తాగునీటికి లేక ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని అమలాపురం మండలం వన్నెచింతలపూడి గ్రామానికి చెందిన పరిపేట గ్రామస్తులు సోమవారం గ్రీవెన్స్‌లో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అనంతరం కలెక్టరేట్ వద్ద వారు నిరసన తెలిపారు. వన్నెచింతలపూడిలో ఒక వాటర్ ట్యాంక్ నుండి ఎక్కువ జనాభా ఉన్న 5 పేటలకు నీళ్లు ఇవ్వడంతో పరపేట ప్రజలకు నీళ్లు అందే పరిస్థితి లేదు. మంచినీళ్లు కావాలంటే 2 కిలోమీటర్లు దూరం వెళ్లి తెచ్చుకునే పరిస్థితి ఏర్పడింది.గత సంవత్సరం పరపేటలో నూతన వాటర్ ట్యాంక్ నిర్మాణం చేపట్టారు. మొత్తం మీద వాటర్ ట్యాంక్ పనులు వేగవంతం గా జరిగాయి. చివరి దశలో ట్యాంక్ పూర్తి అయిన సరే ప్రారంభోత్సవానికి నోచుకోని పరిస్థితి ఏర్పడడంతో మహిళలు చేసేది ఏమీ లేక అమలాపురం జిల్లా కలెక్టర్ కార్యాలయం చేరుకుని మంచినీటి కష్టాలు కలెక్టర్ కార్యాలయంలోని అధికారులకు వివరించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వాటర్ ట్యాంక్ ప్రారంభం చేయాలని, వేసవికాలం ప్రారంభం కావడంతో తాగునీటి కష్టాలు రోజురోజుకీ పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు వెంటనే స్పందించాలని లేనిపక్షంలో పెద్ద ఎత్తున గ్రామంలో మహిళలంతా నూతన వాటర్ ట్యాంకు దగ్గర ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పరమట దుర్గా భవాని, సీతామహాలక్ష్మి, విజయలక్ష్మి, కృష్ణవేణి, వెర్రమ్మ, చింతాలమ్మ, సుందరి, వేణి, చీకురుమెల్లి శ్రీదేవి, సకిలే అరుణ పాల్గొన్నారు.



కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న మహిళలు

సమస్యలపై తల్లీ బిడ్డ ఎక్స్‌ప్రెస్ ఉద్యోగుల ధర్నా

ప్రజాశక్తి-అమలాపురం

తమ సమస్యలు పరిష్కరించాలని తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ ఉద్యోగులు సోమవారం కలెక్టర్ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షుడు జి.దుర్గాప్రసాద్, తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ ఉద్యోగుల యూనియన్ జిల్లా కార్యదర్శి నాగేంద్ర మాట్లాడారు. ఎంప్లాయిస్ అందరికీ ఉద్యోగ భద్రత, సమాన పనికి సమాన వేతనం, కల్పించాలని డిమాండ్ చేశారు. మార్చి 31తో అరబిందో సంస్థ కాంట్రాక్ట్ రద్దు కావడంతో మరో కాంట్రాక్టు వస్తే పాత ఎంప్లాయీస్‌ను కొనసాగించాలని, కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం రూ.7850 ఇస్తున్నారని, ఈ జీతాలతో కుటుంబాలను పోషించుకోవడం ఎలా అని ప్రశ్నించారు. డ్రైవర్లందరకు కనీస వేతనం అమలు చేయాలని, పిఎఫ్ యాజమాన్యం తరఫున కట్టించాలని, వాహనాల మరమ్మతులు ప్రభుత్వమే చేయించాలని, ఖాళీ పోస్టులు వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న ఉద్యోగులు



అధికారులతో మాట్లాడుతున్న డిఆర్ఒ

ఇంజినీర్ల పోస్టుల భర్తీకి నేడు రాత పరీక్ష

ప్రజాశక్తి-అమలాపురం

ఎపి పబ్లిక్ సర్వీస్ కమిషన్ సహాయ పర్యావరణ ఇంజనీర్ల పోస్టుల భర్తీకి కంప్యూటర్ బేస్డ్ రాత పరీక్షను మంగళవారం నిర్వహించనున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి బిఎల్ఎన్.రాజకుమారి తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో రాత పరీక్ష నిర్వహణ సన్నద్ధత ఏర్పాట్లపై అధికారులతో ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కమిషన్ ఆధ్వర్యాన సహాయ పర్యావరణ ఇంజనీర్ల పోస్టుల కోసం 340 మంది దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. వీరి రాత పరీక్ష నిర్వహణకు రెండు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కాట్రేనికోన మండలం చెయ్యేరులో శ్రీనివాసా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో 165 మంది అభ్యర్థులు, బోనం వెంకటాచలమయ్య కళాశాలలో 175 మంది అభ్యర్థులు రాత పరీక్ష రాసేందుకు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మంగళవారం ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష సమయం ఉంటుందని, సమన్వయ అధికారులుగా డిటిలు జివిఎస్ఎస్ సుబ్రహ్మణ్యం, ఎంబి ఆలీ వ్యవహరిస్తారని తెలిపారు. ఎపి పబ్లిక్ సర్వీస్ కమిషన్ సెక్షన్ అధికారి కె.భాస్కరరావు, డిఎంహెచ్ఒ డాక్టర్ ఎం.దుర్గారావు దొర పాల్గొన్నారు.

ప్రతి ఎకరాకూ సాగు నీరందించాలి

ప్రజాశక్తి-రామచంద్రపురం

నియోజకవర్గంలో ప్రతి ఎకరాకీ సాగునీరు అందించేలా అధికారులు డిస్ట్రిబ్యూటరీ కమిటీలు చర్యలు చేపట్టాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అధికారులను ఆదేశించారు. సోమవారం రామచంద్రపురం పట్టణంలోని లయన్స్ క్లబ్ కళ్యాణ మండపంలో ఇరిగేషన్, అధికారులు, డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, రైతులతో మంత్రి మాట్లాడారు. నియోజకవర్గంలో సాగునీటి ఎద్దడి తలెత్తకుండా తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. ప్రస్తుతం పంట పొలాలు ఈనిక దశలో ఉన్నాయని, సాగునీటి ఎద్దడి తలెత్తకుండా ప్రతి ఎకరానికీ సాగునీరు అందించేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ఏ ఒక్క ఎకరం కూడా ఎండడానికి వీల్లేదన్నారు. గతంలో డ్రైనేజీలు, కాలువలను పట్టించుకోక పోవడంతో గుర్రపు డెక్క పూడికతో నిండి అధ్వానంగా తయారయ్యాయన్నారు. వైసిపి ప్రభుత్వం కాలువలను రైతులను పట్టించుకోలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక డ్రైనేజీలు కాలువలను బాగు చేయడంపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. అధికారులు కూడా గతంతో పోలిస్తే ఇప్పుడు మెరుగ్గా పనిచేస్తున్నారని కితాబు ఇచ్చారు. రైతు 10 వేళ్లు మట్టిలో పెడితేనే మన 5 వేళ్లు నోట్లోకి వెళ్తాయని గుర్తు చేశారు. డిస్ట్రిబ్యూటరీ కమిటీలు అధికారులు, రైతులకు మధ్య వారధిలా పని చేయాలన్నారు. డిస్ట్రిబ్యూటరీ కమిటీలు క్షేత్రస్థాయిలో ఎక్కడ నీరందడం లేదో గుర్తించి అధికారుల దృష్టికి తీసుకెళ్లి సాగునీటి సమస్యలను పరిష్కరించేలా చర్యలు చేపట్టాలన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొమ్మిది నెలల నుంచి గతంలో ఉన్న సమస్యలను అధిగమించి అందరూ కష్టపడి పని చేస్తున్నారన్నారు. ఎక్కడో కొన్నిచోట్ల శివారు భూములకు నీరందకపోతే మండలమంతా సాగు నీరందడం లేదని కొంతమంది ప్రచారం చేస్తున్నారని అది తగదని హితవు పలికారు. డిస్ట్రిబ్యూటరీ కమిటీలు మెరుగ్గా పని చేస్తున్నాయని ఇంకా మెరుగ్గా పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. సూపర్ సిక్స్‌లో భాగంగా ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేరుస్తుందన్నారు. త్వరలోనే రైతులకు అన్నదాత సుఖీభవ కింద పెట్టుబడి సాయం అందించే విధంగా నిధులు విడుదల చేస్తామని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఇఇ రామకృష్ణ, డ్రైన్స్ డిఇ పోచారావు, డిస్ట్రిబ్యూటరీ కమిటీ కాజులూరు, రామచంద్రపురం, ఎర్రపోతవరం, కోటిపల్లి అధ్యక్షులు ఎల్.కృష్ణ చైతన్య, ఎం.సత్యనారాయణ రెడ్డి, విజయరామరాజు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సుభాష్

28న కపిలేశ్వరపురం మండల సమావేశం

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 28న నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ కె.రత్నకుమారి తెలిపారు. సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ స్థానిక మండల పరిషత్ సమావేశం మందిరంలో శుక్రవారం ఉదయం 10:30 గంటలకు ఎంపిపి మేడిశెట్టి సత్యవేణి దుర్గారావు అధ్యక్షతన జరిగే సమావేశంలో నియోజకవర్గ ప్రజాప్రతినిధులు పాల్గొంటారన్నారు. ఈ సమావేశంలో పలు అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో జెడ్‌పిటిసి, గ్రామ సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, డివిజినల్, మండల స్థాయి అధికారులు తమ శాఖలకు సంబంధించి పూర్తి సమాచారంతో హాజరు కావాలని కోరారు.

చొప్పెల్ల సొసైటీ అక్రమాలపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-ఆలమూరు

మండల పరిధిలోని చొప్పెల్ల ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో జరిగిన అక్రమాలపై చర్యలు తీసుకోవాలని గ్రామానికి చెందిన రైతు దంగేటి బాపనయ్య సోమవారం ప్రజా సమస్య పరిష్కార వేదికలో తహశీల్దార్ కెజె.ప్రకాష్ బాబుకు వినతిపత్రం అందజేశారు. తన తల్లి లేటు దంగేటి లక్ష్మి సొసైటీలో రుణం తీసుకున్నారని, సొసైటీలో పంట రుణమాఫీలో తమకు తీరని అన్యాయం జరిగిందని ఆ లేఖలో పేర్కొన్నారు. సొసైటీలో 2008 సం.లో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన రుణమాఫీలో చొప్పెల్ల సొసైటీలో జరిగిన అక్రమాలపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని సహకారశాఖ వారు రిపోర్టులో పేర్కొన్నారు. కానీ ఇంతవరకు బాధ్యులపై చర్యలు తీసుకోలేదని ఆ లేఖలో తెలిపారు. దీంతో రైతులకు న్యాయం జరగలేదన్నారు.

అర్జీదారుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

ప్రజాశక్తి-అమలాపురం

అర్జీదారుల సమస్యల పట్ల సానుకూలంగా స్పందించి సకాలంలో నాణ్యతతో పరిష్కరించాలని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ గోదావరి భవన్‌లో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక మీ కోసం కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్, జాయింట్ కలెక్టర్ నిశాంతి, డిఆర్ఒ రాజకుమారి, జిల్లా నీటి యాజమాన్య సంస్థ పీడీ మధుసూదన్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కృష్ణ మూర్తి అర్జీదారుల నుండి సుమారు 335 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టి వివిధ స్థాయిలలో పర్యవేక్షిస్తోందని, ఆ దిశగా నూటికి నూరు శాతం నాణ్యమైన పరిష్కార మార్గాలు చూపుతూ వ్యవస్థ పనితీరు పట్ల అర్జీదారుల్లో నమ్మకాన్ని పెంపొందించాలన్నారు. ప్రతి అర్జీనీ క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా విచారించి తదుపరి తగు పరిష్కార మార్గాలు సకాలంలో చూపాలని సూచించారు. గడువు దాటిన అర్జీలు లేకుండా అప్రమత్తంగా అర్జీలను ఎవరి స్థాయిలో వారు పరిష్కారానికి చర్యలు తీసుకోవానలి ఆదేశించారు. అర్జీల పరిష్కారంలో నాణ్యతకు పెద్దపీట వేస్తూ అదే అంశంపై మరల ఫిర్యాదు నమోదు కాకుండా మెలకువలు పాటించాలన్నారు. సిపిఒ వెంకటేశ్వర్లు, జిల్లా అధికారులు కృష్ణారెడ్డి, రామకృష్ణారెడ్డి, డిసిహెచ్ఎస్ కార్తీక్, డిఎం అండ్ హెచ్ఒ, దుర్గారావు దొర, మత్స్యశాఖ జెడి ఎస్.శ్రీనివాసరావు, డిఐపి ఆర్ఒ కె.లక్ష్మీనారాయణ, ట్రాన్స్‌కో ఎస్ఇ ఎస్.రాజబాబు పాల్గొన్నారు.




అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ మహేష్ కుమార్

పరిశ్రమల స్థాపనకు ముందుకు రావాలి

ప్రజాశక్తి-ముమ్మిడివరం

యువత చిన్న మధ్య తరహా పరిశ్రమల స్థాపనకు ముందుకు రావాలని జిల్లా పరిశ్రమల శాఖ అధికారి ప్రసాద్ సూచించారు. నగర పంచాయతీ పరిధిలోని స్థానిక డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కన్వెన్షన్ హాల్లో సోమవారం డెవలప్మెంట్ కార్పొరేషన్, పరిశ్రమల శాఖల ఆధ్వర్యంలో మేధో సంపత్తి హక్కులు – ప్రభుత్వ పథకాల విధి విధానాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న పరిశ్రమల అధికారి ప్రసాద్ మాట్లాడుతూ నిరుద్యోగ యువత ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలతో పాటు బ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకోవడం ద్వారా పరిశ్రమల స్థాపనకు ముందుకు రావాలని సూచించారు. సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమల స్థాపనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎటువంటి క్రెడిట్ గ్యారంటీ లేకుండా ఐదు కోట్ల వరకు ఇచ్చే రుణాలను పొంది విరివిగా పరిశ్రమల స్థాపనకు నాంది పలకాలని వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల శాఖ అధికారిని మాధురి, కోఆర్డినేటర్ వెంకట్, గణేష్, కె.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



మహిళల భద్రతే ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి-రామచంద్రపురం

మహిళల భద్రత, సాధికారత లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. సోమవారం ఐసిడిఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. డాక్టర్ చెలికాని రామారావు స్మారక భవనంలో సిడిపిఒ వరహాలక్ష్మి అధ్యక్షతన ఈ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి సుభాష్ మాట్లాడుతూ మహిళా సాధికారత కోసమే ప్రభుత్వం పని చేస్తోందన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా బడ్జెట్లో మహిళా శిశు సంక్షేమం కోసం రూ.4,332 కోట్లు వెచ్చించిందన్నారు. మహిళలు శక్తి యాప్‌ను డౌన్లోడ్ చేసుకుని ఆపద సమయాల్లో రక్షణ పొందాలని సూచించారు. మహిళలు బాగా చదువుకోవాలని, ప్రశ్నించే తత్వం అలవర్చుకోవాలన్నారు. మహిళకు ఆస్తి హక్కు కల్పించడం ద్వారా పురుషులతో సమాన హోదా కల్పించారని వివరించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీలు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీ నాయకులు పోలిశెట్టి చంద్రశేఖర్, ఎంఇఒ నాగేశ్వరి, డాక్టర్ కవిత, అంగన్‌వాడీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి మేడిశెట్టి దుర్గ, ప్రాజెక్ట్ అధ్యక్షురాలు వీరలక్ష్మి, సూపర్వైజర్లు, టీచర్లు ఆయాలు పాల్గొన్నారు. అనంతరం కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు.



కేక్ కట్ చేస్తున్న మంత్రి సుభాష్, అంగన్‌వాడీలు



కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న ఆక్వా రైతులు

ఆక్వాకు మద్దతు ధర కల్పించాలని ధర్నా

ప్రజాశక్తి-అమలాపురం

ఆక్వా రైతులకు మద్దతు ధర కల్పించాలని రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్, టిడిపి అల్లవరం మండల అధ్యక్షుడు దెందుకూరి సత్తిబాబు రాజు డిమాండ్ చేశారు. అమలాపురంలో సోమవారం ఆక్వా రైతులు నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆక్వా ఎగుమతిదారుల నియంతృత్వ ధోరణి నశించాలని, రొయ్యలకు మద్దతు ధర కల్పించాలని కోరారు. రొయ్యల మేత తయారీకి వాడే ముడు సరుకుల రేట్లు తగ్గినప్పటికీ రొయ్యల మేతల ధరలు తగ్గించలేదని వాపోయారు. తక్కువ లోడు విద్యుత్తు సరఫరా వల్ల ఆక్వా రంగం నష్టాలకు విద్యుత్ శాఖ కారణంగా నిలుస్తుందన్నారు. తక్షణమే నాణ్యమైన విద్యుత్ ను అందించాలని ఆయన డిమాండ్ చేశారు. ఆక్వా రైతుల సమస్యలపై జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో యాళ్ళ వెంకటానందం, త్సవటపల్లి నాగభూషణం, వేగిరాజు వెంకటరాజు, రుద్రరాజు నాని రాజు, త్సవటపల్లి శ్రీను, గుమ్మళ్ల సురేష్, సత్తి శ్రీను పాల్గొన్నారు.



మల్లవానితోటలో దొమ్మేటి జయంతి వేడుకలు

ఘనంగా దొమ్మేటి జయంతి వేడుకలు

ప్రజాశక్తి - ఆలమూరు

విద్యా ప్రదాత, సంఘ సంస్కర్త, దొమ్మేటి వెంకటరెడ్డి 172వ జయంతి వేడుకలలో భాగంగా మండలంలోని మడికి శివారు మళ్లవానితోటలో శెట్టిబలిజ సంఘం ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. టిడిపి సీనియర్ నేత పంపన అంజి బాబు నివాసం వద్ద ఆయన అధ్యక్షతన పెద్ద ఎత్తున సంఘ నాయకులు హాజరై దొమ్మేటి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అంజిబాబు మాట్లాడుతూ ఐక్యతతో అంతా కలిసిమెలిసి ముందుకు వెళ్లాలని సంఘం కోసం ప్రతి ఒక్కరూ పోరాడాలన్నారు. స్తోమత లేక విద్యకు దూరమైన బడుగు బలహీన వర్గాల పిల్లలను పాఠశాల వద్దే భోజన ఏర్పాట్లు చేసి విద్యను అందించిన ఘనత దొమ్మేటి సొంతమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నేత పంపన సురేష్, నాయకులు ఇళ్ల రమణ, గుత్తుల గోవిందు, కట్టా శివ, తుమ్మూరి గోవిందు, చెల్లబోయిన శివ, కాంద్రేగుల గోవిందు, తదితర నాయకులు, కార్యకర్తలు, బాలలు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

గుర్తు తెలియని వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి - సామర్లకోట

సామర్లకోట రైల్వే స్టేషన్ పరిధిలోని బిక్కవోలు - అనపర్తి రైల్వే స్టేషన్‌ల మధ్య గుర్తుతెలియని వ్యక్తి రైలునుంచి జారిపడి దుర్మరణం చెందాడు. మృతుడు వయస్సు సుమారు 50 నుంచి 55 వరకూ ఉంటుందని,ఆలీవ్ గ్రీన్ ఫ్యాంట్, తెలుపు, కాఫీరంగు డిజైన్ కలిగిన చొక్కా, రెయిన్ కోటు ధరించి ఉన్నాడని రైల్వే ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. కీమెన్ వి.కొండబాబు ఇచ్చిన సమాచారంపై మృతదేహానికి పంచనామా నిర్వహించి కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు ధర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

ప్రజాశక్తి - పెరవలి

మండలంలోని అన్నవరప్పాడు వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పిట్ల వేమవరం గ్రామానికి చెందిన మాకా సురేష్(31), నేతల హనుమంతు(26) మృతి చెందారు. అన్నవరప్పాడు పనికి వెళ్లి తిరిగి వారి గ్రామానికి బైకుపై వెళ్తుండగా అన్నవరప్పాడు సెంటర్‌కు వచ్చేసరికి రావులపాలెం వైపు నుంచి తణుకు వైపు వెళ్తున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో మాకా సురేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన హనుమంతును ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. వీరి మృతితో ఇరు కుటుంబాల్లో విషాదం అలముకుంది. మృతుడు సురేష్ తండ్రి మాకా వెంకటేశులు ఫిర్యాదుపై కేసు నమోదు చేశామని ఎస్ఐ ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు.

సారా స్థావరాలపై దాడులు

ప్రజాశక్తి - ఆత్రేయపురం

మండలంలోని 17 గ్రామాల లంకల పరీవాహక ప్రాంతాలలో ఎక్సైజ్ ఎస్ఐ అన్నవరం తన సిబ్బందితో సోమవారం విస్తృతంగా దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో వెలిచేరు శివారు లంకల ఇసుక తిన్నెల్లో నాటు సారా తయారు చేయడానికి నిలువ ఉంచిన 6 వందల లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేసి నాటు సారా తయారీకి ఉపయోగించే సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని మహిళ మృతి

ప్రజాశక్తి - అంబాజీపేట

పుల్లేటికుర్రు పరిధి చినలంకలో గుర్తుతెలియని వాహనం ఢీకొని మహిళ మతి చెందిన సంఘటన సోమవారం జరిగింది. ప్రధాన రోడ్డుపై మతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా అంబాజీపేట ఎస్ఐ కె.చిరంజీవి సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఈ ప్రమాదం తెల్లవారు జామున జరిగి ఉంటుందన్నారు. మహిళ వయసు 35 ఏళ్లు ఉంటుందని, నాలుగు రోజుల నుంచి ఆమె అంబాజీపేట పరిధిలోని పరిసర ప్రాంతాలలో సంసరిస్తోందని స్థానికులు తెలిపారు. మృతదేహాన్ని అమలాపురం ఆసుపత్రికి తరలించమని ఎస్ఐ తెలిపారు.

బెల్ట్ షాపులను నివారించాలి

ప్రజాశక్తి - ఏలేశ్వరం

గ్రామాల్లోని బెల్టు షాపులను నివారించాలని జై భీమ్‌రావు భారత్ పార్టీ ఉపాధ్యక్షుడు దాడిశెట్టి వీరబాబు సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. విద్యాసంస్థలు, ఆసుపత్రులు, దేవాలయాలు జాతీయ రహదారులు సమీపంలో బెల్ట్ షాపులు విచ్చలవిడిగా పుట్టుకొచ్చాయన్నారు. ఇప్పటికే పిజిఆర్ఎస్ కార్యక్రమంలో అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అయినా ఫలితం లేకుండా పోయిందన్నారు. అధికారులు బెల్ట్‌షాపుల నిర్వాహణపై ప్రత్యేక దృష్టి సారించి నిర్మూలించాలని కోరారు.

తాగునీటి ప్రాజెక్టు స్థలం పరిశీలన

ప్రజాశక్తి-ముమ్మిడివరం

ప్రభుత్వం ఎఐబి నిధులతో చేపట్టనున్న తాగునీటి ప్రాజెక్టు నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని ఆర్‌డిఒ కె.మాధవి సోమవారం పరిశీలించారు. నగర పంచాయతీ పరిధిలోని 20వ వార్డులోని మట్టాడిపాలెంలో సుమారు రూ.161 కోట్ల 56 లక్షల నిధులతో చేపట్టే తాగునీటి సరఫరా ప్రాజెక్టు నిర్మాణానికి అసరమైన స్థలాన్ని ఆర్‌డిఒ పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం పట్టణ ప్రాంత నీటి సరఫరా, మురుగు నీటి నిర్వహణ అభివృద్ధి ప్రాజెక్టు ఏడేళ్లలో నిర్మాణం పూర్తి చేయాలని, దీని నిర్వహణకు గాను 29 కోట్ల 87లక్షల వెచ్చించి నిర్మాణం చేపట్టనున్నట్లు ఆమె తెలిపారు. ఆమె వెంట నగర పంచాయతీ కమిషనర్ రవివర్మ, తహశీల్దార్ ఎంవి.సుబ్బలక్ష్మి, నగర పంచాయతీ ఎఇ పివి.సుధాకర్, టౌన్ ప్లానింగ్ అధికారి బి.రాజేష్ బాబు, డిప్యూటీ తహసీల్దార్ బి.గోపాలకృష్ణ, మండల సర్వేయర్ ప్రసాద్ పాల్గొన్నారు.

సారా రహిత సమాజమే లక్ష్యం

ప్రజాశక్తి - ఆలమూరు

ఆరోగ్యాన్ని క్షీణింప చేసే నాటు సారా రహిత సమాజమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎస్‌కెవిడి.ప్రసాద్ కోరారు. మండలంలోని జొన్నాడ ఎన్‌టిఆర్ కాలనీ వద్ద సోమవారం నవోదయం 2.0 కార్యక్రమాన్ని ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో సర్పంచ్ కట్ట శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఇఎస్ ప్రసాద్ మాట్లాడుతూ సారా తయారీకి అనేక రకాల నిషేధ పదార్థాలను ఉపయోగించి సారాను తయారు చేస్తుంటారన్నారు. దీంతో వీటిని సేవించే ప్రజలకు తీవ్ర అనారోగ్యాలకు గురి కావాల్సి వస్తుందన్నారు. ఈ సమావేశంలో తహశీల్దారు కెజె.ప్రకాష్ బాబు, ఎక్సైజ్ సిఐ డి.నాగేశ్వరరావు, ఎస్ఐ రాంబాబు, ముఖ్య నేతలు తాడి శ్రీనివాస్ రెడ్డి, గొడవర్తి బాబీ, అయినవిల్లి సత్తిబాబు గౌడ్ పాల్గొన్నారు.

ఘనంగా కొత్తపూల ఉత్సవం

ప్రజాశక్తి - ఆలమూరు

చింతలూరులోని శ్రీనూకాంబిక అమ్మవారి జాతర, తీర్థ మహోత్సవాలకు విశేష ఆదరణ లభిస్తోంది. దేవాలయ ఇఒ ఉండవల్లి వీర్రాజు చౌదరి, ఉత్సవ సేవా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక అమ్మవారి ఆలయ ఆవరణలో సోమవారం వేకువ జాము వరకు ఆరవ విడత కొత్తపూల ఉత్సవం నిర్వహించారు. మోదుగుపూలతో అలంకరించిన పెద్దగరగను యాత్రికులు దర్శించుకున్నారు. గరగ నృత్యాలు అలరించాయి.

అందరి భాగస్వామ్యంతోనే క్షయ నిర్మూలన

టిబి వ్యాధికి అందుబాటులో చికిత్స, నివారణ ఉన్నాయని పలువురు వైద్యులు సూచించారు. సోమవారం క్షయ వ్యాధి నివారోత్సవాలను జిల్లావ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు.

ప్రజాశక్తి-యంత్రాంగం

అమలాపురం అందరి సమన్వయ భాగస్వామ్యంతో క్షయ నివారణ చర్యలను బలోపేతం చేయాలని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ పిలుపు నిచ్చారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రపంచ క్షయ నిర్మూలన దినోత్సవం సందర్భంగా ఆయన పోస్టర్‌ను ఆవిష్కరించారు. జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, మాట్లాడారు. స్థానిక ఏరియా ఆసుపత్రిలో నిర్వహించిన సభలో జిల్లా క్షయ వ్యాధి నియంత్రణ అధికారి సిహెచ్‌వి.భరత లక్ష్మి మాట్లాడారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శంకర్రావు, డాక్టర్ సుమలత, ఆర్‌బిఎస్ కో ఆర్డినేటర్ జాన్ లేవీ పాల్గొన్నారు.

రామచంద్రపురం అవగాహన సదస్సులో సూపరిండెంట్ డాక్టర్ ఎం.ప్రవీణ్ మాట్లాడారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో వైద్యులు, వెంకటేశ్వరరావు, నర్సులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ఆలమూరు పెదపల్ల, చొప్పెల్ల పిహెచ్‌సిల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ డి.సాయి కిషోర్, హెల్త్ ఎడ్యుకేటర్ రాజా అక్కుల, సిహెచ్ఒ ఎంఎస్ఎన్ రెడ్డి, సూపర్వైజర్ శ్రీనివాస్, ఉమ పాల్గొన్నారు.

అంబాజీపేట అంబాజీపేట, ముక్కామల పిహెచ్‌సిల వద్ద ఎంపిపి దొమ్మేటి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారులు కెఎన్.శ్రీనివాస్, డాక్టర్ పి.రవికుమార్, సిహెచ్ఒలు బి.అప్పారావు, ఎమ్.రవికుమార్ పాల్గొన్నారు.

అయినవిల్లి వీరవల్లిపాలెం పిహెచ్‌సి వద్ద ర్యాలీ మానవహారం నిర్వహించారు. డాక్టర్ పి.విజయ్, సూపర్వైజర్ ఎం రామారావు, ల్యాబ్ టెక్నీషియన్ నరేష్ బాబు పాల్గొన్నారు.

కొత్తపేట సిహెచ్‌సి సూపరింటెండెంట్ డాక్టర్ గన్నవరపు దుర్గాప్రసాద్ ఆధ్వర్యాన ర్యాలీ నిర్వహించారు. వైద్యులు డాక్టర్ ఎం.వీరబాబు, డాక్టర్ ఎస్.శ్రీదివ్య, డాక్టర్ ఎ.మోహన్, అవిడి పిహెచ్‌సి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బి.వెంకట్, మెల్లం దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

ముమ్మిడివరం పిహెచ్‌సి వైద్యాధికారి బి.శ్రీపూజ ర్యాలీని ప్రారంభించారు. కమ్యూనిటీ ఆసుపత్రిలో సూపరిండెంట్ వైద్యురాలు శృతి సూపర్‌వైజర్ సంపూర్ణ, ఫార్మసిస్ట్ సత్యనారాయణ పాల్గొన్నారు.



అంబాజీపేటలో ప్రతిజ్ఞ చేస్తున్న వైద్య సిబ్బంది



ముమ్మిడివరంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది


అమలాపురం ఏరియా ఆసుపత్రి వద్ద సిబ్బంది అవగాహన ర్యాలీ

రోడ్ల నిర్మాణంలో నాణ్యతకు తిలోదకాలు

ప్రజాశక్తి- పి.గన్నవరం

వరద ప్రభావిత ప్రాంతాలైన ఉడిమూడి లంకలో ఉపాధి హామీ నిధులతో నిర్మిస్తున్న సిసి రోడ్ల నిర్మాణాల తీరుపై పలు విమర్శలు వస్తున్నాయి. దీర్ఘకాలం మన్నాల్సిన సిసి రోడ్ల నాణ్యతా లోపాలతో నిర్మిస్తుండడంతో వరద ప్రవాహ ఒత్తిడికి తట్టుకోగలుగుతాయా అని స్థానికులు సందేహం వ్యక్తం చేస్తున్నారు. 12 వర్కులకు రూ.4.30 కోట్లతో పూర్తిగా వరద ప్రభావిత ప్రాంతమైన లంక గ్రామాల్లో రోడ్ల నిర్మాణ పనులకు ఆమోదం లభించింది. సిసి రోడ్డులను క్వారీ గ్రావెల్‌తో నిర్మించాల్సి ఉండగా మూడు అడుగులు మందంతో బొండు ఇసుక వేసి నిర్మిస్తున్న తీరుపై స్థానికుల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా రోడ్డు నిర్మాణం చేస్తున్నారని వారు ఆరోపిస్తున్నారు. ఇప్పటికే ఇదేవిధంగా మూడు రోడ్డు పనులు చేపట్టారని తెలిపారు.

దీనిపై పంచాయతీరాజ్ జెఇ కెవి.కృష్ణంరాజును వివరణ కోరగా రోడ్డు నిర్మాణాలను పరిశీలిస్తామని, నిబంధనలకు అనుగుణంగా రోడ్ల నిర్మాణ పనులు చేపడతామని తెలిపారు.


రోడ్ల నిర్మాణాలకు సిద్ధంగా ఉంచిన బొండు ఇసుక

కూల్చివేసిన పాఠశాల భవనం పరిశీలన

ప్రజాశక్తి-అయినవిల్లి

వెలువలపల్లిలో కొందరు దౌర్జన్యంగా కూల్చి వేసిన ప్రభుత్వ పాత పాఠశాల భవనాన్ని ఎంపిడిఒ గిడ్ల భీమారావు, ఎంపిపి మట్టపర్తి నాగ విజయలక్ష్మి సోమవారం పరిశీలించారు. స్థానికుల నుండి సమాచారాన్ని సేకరించారు. ప్రభుత్వ ఆస్తుల్ని ధ్వంసం చేయడం తీవ్రమైన నేరమని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. దీనిపై పాఠశాల హెచ్‌ఎం పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. కూల్చివేతకు కారకులైన మోత బాబూరావు, మోత నాగపండు, జెసిబి యజమాని డ్రైవర్‌పై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బొంతు మణి శ్రీనివాస్, ఎంఇఒలు కె.వెంకటేశ్వరరావు, పి.శ్రీనివాసరావు, హెచ్‌ఎం జి.లలితాదేవి, బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

దళితపేట రోడ్డుకు మోక్షం

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

ఎంతోకాలంగా విలసవిల్లి వడ్డివారి దళిత పేట నుంచి సుమారు 700 మీటర్లు పొడవు ఉన్న భీమ్ నగర్‌కు వెళ్లే దళిత పేటకు సరైన రోడ్డు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సర్పంచ్ సలాది ఊర్మిళదేవి పంచాయతీ నిధులు రూ.10 లక్షలతో మెటల్ రోడ్డు నిర్మాణానికి సోమవారం శంకుస్థాపన చేశారు. సర్పంచ్ ఊర్మిళదేవికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సలాది సతీష్, బీర శాంత కుమారి, వడ్డి ధర్మేష్, బీర నరసింహమూర్తి, భీమవరపు నరేష్, చింతపల్లి గిరి, వస్కా మల్లేష్, వడ్డి నరేష్ పాల్గొన్నారు.


రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ ఊర్మిళా దేవి

సత్యానందరావు గెలుపుపై పాదయాత్ర

ప్రజాశక్తి - ఆలమూరు

కొత్తపేట ఎంఎల్‌ఎగా బండారు సత్యానందరావు గెలిస్తే శ్రీశైలం పాదయాత్ర చేస్తామని మొక్కు తీర్చుకున్నట్టు మండలానికి చెందిన పలువురు నేతలు తెలిపారు. ఆత్మకూరు నుండి అడ్డదారి నల్లమల అడవుల ద్వారా సుమారు 60 కిలోమీటర్ల మేర పాదయాత్ర చేసి శ్రీశైలం చేరుకుని భ్రమరాంబ మల్లికార్జున స్వామి దర్శనం చేసుకున్నట్టు బడుగువానిలంకకు చెందిన టిడిపి సీనియర్ నేత దూలం రాంబాబు తెలిపారు.

కోర్టు ఆవరణలో చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-రామచంద్రపురం

కోర్టుల ఆవరణలో సోమవారం చలివేంద్రాన్ని 13వ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి ఎం.శంకర్రావు ప్రారంభించారు. వేసవి ఎండలు తీవ్రమవుతున్న తరుణంలో ఈ చలివేంద్రం ప్రజలందరికీ ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. జిల్లా కోర్టుతో పాటు సీనియర్, జూనియర్, మేజిస్ట్రేట్ కోర్టులు, తహశీల్దార్ కార్యాలయం, ఎస్‌టిఒ ఆఫీసు పోలీసు స్టేషన్ వంటి కార్యాలయాలకు వచ్చే ప్రజలందరి దాహార్తిని తీర్చేందుకు ఈ చలివేంద్రం స్థానిక బార్ అసోసియేషన్ సౌజన్యంతో ఏర్పాటు చేశామన్నారు. తొలిరోజు న్యాయమూర్తులు, న్యాయవాదులు, కక్షిదారులు, సుమారు 500 మందికి న్యాయమూర్తులు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి కె.వెంకటేశ్వరరావు, జూనియర్ సివిల్ జడ్జి నిజాం శారద, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి వి.నాగేశ్వరరావు నాయక్, బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు పిల్లి మురళీమోహన్ వెంకటరమణ, వాడ్రేవు సాయిప్రసాద్, చిన్నం వీర్రెడ్డి, పిల్లా పృథ్వి, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కుంగ్‌ఫూ బెల్ట్‌ల బహూకరణ

ప్రజాశక్తి -మామిడికుదురు

టైగర్స్ కుంగ్‌ఫూ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో కుంగ్‌ఫు నేర్చుకుంటున్న విద్యార్థులకు వివిధ రకాల బెల్ట్‌లు బహూకరించారు. రిటైర్డ్ హెచ్‌ఎం భూపతి సత్యనారాయణ గృహం వద్ద సోమవారం ఈ పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా కె.శివకోటి గ్రాండ్ మాస్టర్, కె.సాయివంశీ. ఇన్‌ఛార్జి, కోచ్ ఎం.శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎస్‌సి వర్గీకరణ రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం

ప్రజాశక్తి-అమలాపురం, అంబాజీపేట

ఎస్‌సి వర్గీకరణ రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకమైనదని సోమవారం కలెక్టరేట్ వద్ద బిఎస్‌పి ఆధ్వర్యాన ధర్నా చేశారు. అనతంర జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా దేశ ప్రజల మధ్య విభజన రేఖలు సష్టించి తిరిగి కుల భారతాన్ని నిర్మించాలనే మనువాదుల కుట్రలో భాగమే వర్గీకరణ అని పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి బూసి జాన్ మోషే అన్నారు. రిజర్వేషన్ల వర్గీకరణ వల్ల ఎస్‌సి సామాజిక వర్గాలకు నష్టమే తప్ప ఏ విధమైన ప్రయోజనం లేదన్నారు. వాకపల్లి భీమారావు, కోలా త్రిమూర్తులు, పొలమూరి మోహన్‌బాబు, పెండెం శ్రీను, జెఎస్‌డి.రాజు, తాడి రాంబాబు, ములపర్తి చందు, కుసుమ సత్యనారాయణ, ఆకుమర్తి భూషణం, జనిపెల్లి నాని, గుర్రపు కొత్తియ్య, మోకా శ్రీనుబాబు, పట్నాల సత్యనారాయణ, నల్లి రాజ్ కుమార్, గెల్లా రాజేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

అంబాజీపేటలో మాలమహానాడు నాయకుడు నాగవరపు నాగరాజు బస్టాండ్ వద్ద నుంచి మండల కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పుల్లేటికుర్రు సర్పంచ్ జల్లి బాలరాజు, నెల్లి వెంకటరమణ, మైలే ఆనందరావు, గోసంగి సత్యనారాయణ, ముత్తాబత్తుల ప్రశాంత్, బీర సురేష్, గోసంగి కుమారస్వామి, జయబాబు, కోట విజయరాజు, చింతపల్లి వెంకటేశ్వరావు, కోట బాలకృష్ణ, కుసుమే శ్రీను, కోట గోపి, నక్కా భాస్కర్, సిద్ధాబత్తుల శ్రీను, గోగు మురళి, కుసుమే రమేష్, సరళ దుర్గపండు, పాల్గొన్నారు.



అమలాపురం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న బిఎస్‌పి నేతలు